క్లుప్తంగా

తొట్లను నీటితో నింపుతాం

సాక్షి ఎఫెక్ట్..

పుల్లలచెరువు: గ్రామాల్లో పశువుల కోసం నిర్మించిన తొట్లను నీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి నాగుల్‌మీరా తెలిపారు. శుక్రవారం 'సాక్షి'లో వృథాగా మంచినీటి తొట్లు అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాలపై స్పందించి ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 45 తొట్లు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించారని, నీరు ఉన్న చోట తొట్లలో నీరు నింపుతామని, నీటి వసతి లేని చోట కార్యదర్శి, గ్రామ సర్పంచ్, పశువైద్య సహాయకుడు గ్రామంలో అందుబాటులో ఉన్న బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీరు నింపేందుకు ఆదేశాలను ఎంపీడీవోతో ఇప్పించి అన్ని తొట్లను నీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దైవాలతో గ్రామోత్సవం



దైవాలను ఊరేగిస్తున్న భక్తులు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో ఈర్ల అంకమ్మ దేవర కొలుపులు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం దైవాలను గ్రామ పుర వీధుల్లో భక్తులు ఊరేగించారు. ఆదివారం అంకమ్మ దేవరను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడంతో కొలుపులు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తిరుమలనాథ స్వామికి భక్తుల పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథ స్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొర్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు, పూల మాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన చేశారు. మొక్కుబడులు ఉన్న భక్తులు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవర్లకు నైవేద్యంగా చెల్లించారు. సంతానం కోసం దంపతులు గిరికొండ చుట్టూ భక్తితో ప్రదక్షిణలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు నో గ్యారెంటీ!

- సూపర్-6 పథకాల కోసం ప్రజల ఎదురుచూపులు
- కూటమి నేతలు ఇచ్చిన హామీలకు మంగళం



కూటమి నేతలు ఎన్నికలకు ముందు ప్రకటించిన సూపర్-6 మ్యానిఫెస్టో

తాళ్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలులోకి వచ్చి దాదాపు సంవత్సరం పూర్తయింది. ఎన్నికల ముందు టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయి. అధికారం చేపట్టిన వెంటనే సూపర్-6 పథకాలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను నేటి పాలకులు నిలువునా మోసం చేశారు. ఒక్క పథకాన్ని కూడా ఏడాదిలో అమలు చేయక పోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజలు మండిపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించి వాటి ఫలాలను లబ్ధిదారులకు అందించడంలో వంద శాతం సఫలమయ్యారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే ఇంటింటికీ పెన్షన్, ఇంటింటికీ రేషన్ పంపిణీని రద్దు చేసి లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు నేడు గుర్తు చేసుకుంటున్నారు. కూటమి నాయకులు సూపర్ 6 పథకాల్లో నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 3 ఉచిత సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలతో పాటు 144 పథకాలను అమలు చేస్తామని ప్రజలను బురిడీ కొట్టించి ఓట్లు దండుకున్నారు.

అన్నదాత సుఖీభవ డబ్బులు ఎక్కడ:



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసింది. రైతులకు రైతు భరోసా డబ్బులు సకాలంలో అందించి సాగుకు సహకరించింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి.

– గువ్వల శ్రీనివాసరెడ్డి, రైతు నాయకుడు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి:



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి. నిరుద్యోగ యువతకు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలి. నిరుద్యోగులకు అండగా నిలవాలి, నిరుద్యోగ భృతి ద్వారా వారికి ఇస్తామన్న రూ.3 వేలు వెంటనే ఇవ్వాలి.

– కొర్రపాటి విష్ణు, యువజన నాయకులు

లా నేస్తం పథకం అమలు చేయాలి:



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రాక్టీస్ చేసే జూనియర్ లాయర్లకు లానేస్తం పథకం ద్వారా రూ.5 వేలు అందించి వారికి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో రూ.10 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ఆ డబ్బులు న్యాయవాదులకు వెంటనే చెల్లించాలి.

– భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, అడ్వకేట్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు:



సూపర్-6 పథకాల్లో భాగంగా ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పింది. మహిళలు ఉచిత బస్సు ప్రయాణ కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి.

– యామర్తి ప్రభుదాస్, దళిత నాయకుడు

రెస్టారెంట్ల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి

- డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

కురిచేడు: టీకొట్లు, రెస్టారెంట్ల వద్ద ప్రత్యేక డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి చెత్తను అందులోనే వేసే విధంగా చూడాలని డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. చెత్త సంపద తయారీ కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్డు వద్ద మరుగుదొడ్డి, పూలమొక్కలు, సోలార్ లైట్, కెమెరా ఏర్పాటు చేయాలన్నారు. క్లాప్‌మిత్రల జీతం బకాయి లేకుండా చెల్లించాలని ఆదేశించారు. చెత్త సంపద కేంద్రం చుట్టూ ప్రహరీ, గేటు ఏర్పాటు చేసి పెయింటింగ్ వేయించాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో పాలిథిన్ కవర్లు ఎవరూ ఉపయోగించకుండా చూడమన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ రిక్షాలకు మరమ్మతులు చేయించాలని, ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం 7 గంటల కల్లా ఫీల్డ్‌లో ఉండాలని క్లాప్‌మిత్రల పనులు పరిశీలించి నోట్ క్యాంపుతో ఫొటోలను గ్రూపులో పోస్ట్ చేయమని చెప్పారు. ఆర్థిక సంఘం నిధులను టైడ్ అండ్ టైడ్ గ్రాంట్ జీఓ ప్రకారం మాత్రమే ఖర్చు చేయాలని ఆదేశించారు. అలా చేయని పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్‌కు సరెండర్ చేస్తానని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ కేజీఎస్ రాజు, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ ఉన్నారు.

వైద్యశాల గదులను లీజుకు కేటాయించాలి



సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు అర్జీ అందజేస్తున్న చిరు వ్యాపారులు

పెద్దదోర్నాల: తమ జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా 110ఏ సర్వే నంబర్‌లో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల గదులను తమకే కేటాయించేలా చూడాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు చెందిన గదుల లీజుదారులు మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు విన్నవించుకున్నారు. శనివారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన్ను కలిసి తమ అర్జీ అందజేశారు. 25 సంవత్సరాలుగా తాము అదే గదుల్లో చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. నిరుపేదలమైన తమకు మళ్లీ అవే గదులు లీజుకు ఇప్పించాలని కోరారు. దీనికి స్పందించిన సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ వైద్యశాలకు సంబంధించి ప్రధాన లీజుదారుడిని తనను కలిసేలా చూడాలని తహసీల్దార్ అశోక్‌రెడ్డిని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంకును, పలు రేషన్ దుకాణాలను ఆయన పరిశీలించారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దే రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పోలీసుస్టేషన్‌కు ఆధునిక డ్రోన్ వితరణ



ఆధునిక డ్రోన్‌ను ఎస్పీకి అందజేస్తున్న మారం

తాళ్లూరు: స్థానిక పోలీసుస్టేషన్‌కు విఠలాపురం గ్రామానికి చెందిన వైకుంఠ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో మారం అనంతరెడ్డి శనివారం ఒంగోలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆధునిక డ్రోన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు అందజేశారు. పోలీస్‌స్టేషన్‌కు ఆధునిక డ్రోన్ వితరణగా ఇవ్వడం అభినందనీయమని ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎస్సై ఎస్.మల్లికార్జునరావు అన్నారు. కమిటీ సభ్యుల దాతృత్వాన్ని ఎస్పీ ప్రశంసించారు. మండలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని ఆయన ఆకాంక్షించారు.

బీకేవీపాలెం సర్పంచ్‌కు ఉత్తమ సేవా పురస్కారం

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం ఉత్తమ గ్రీన్ విలేజ్‌గా నిలిచింది. నేషనల్ లోకల్ గవర్నెన్స్ చాంబర్ ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామం అవార్డుకు ఎంపికైంది. సర్పంచ్ పోశం సుమలత శ్రీకాంత్‌రెడ్డి ఉత్తమ నాయకత్వ సేవా అవార్డును శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అందుకున్నారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సుమలత

చెంచులకు ప్రత్యేక ఆధార్ క్యాంప్



ఆధార్ క్యాంప్‌లో చెంచులు

యర్రగొండపాలెం: మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ సచివాలయంలో అసిస్ట్ ఆధ్వర్యంలో శనివారం చెంచులకు ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ దారా వెంకట్రావ్ మాట్లాడుతూ చెంచుల పిల్లలకు ఆధార్ కార్డు లేకపోవడంతో చదువులకు దూరం అవుతున్నారని, వారు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని తమ సంస్థ ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తోందని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెంకటాద్రిపాలెంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌లో 27 మందితో ఎన్‌రోల్ చేయించామని ఆయన తెలిపారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు: మండల కేంద్రంలోని ఊటుకూరి కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ, ఇతర ఒకేషనల్ కోర్సులకు సంబంధించి అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై.వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగా కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జూలై 3వ తేదీన బుధవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, పోస్టులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేస్తామని ఆయన పేర్కొన్నారు.

గుంతలు పూడ్చుకున్న ఆటో డ్రైవర్లు



గుంతలు పూడ్చుకుంటున్న ఆటో డ్రైవర్లు

యర్రగొండపాలెం: గుంతలతో కూడుకున్న రోడ్లపై తమ వాహనాలను నడపలేక ఆటో డ్రైవర్లే రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రం నుంచి పుల్లలచెరువు, త్రిపురాంతకం వెళ్లే తారురోడ్లు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి. అడుగు అడుగుకు ఒక గుంత చొప్పున దాటుకుంటూ దాదాపు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆయా మండల కేంద్రాలకు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం ఈ రోడ్లపై పడిన గుంతలను ఆర్అండ్‌బీ అధికారులు చొరవ చూపి తారుతో ప్యాచింగ్ వర్క్ చేయించేందుకు కూడా ముందుకు రావడం లేదు. ఇటువంటి దుర్భర పరిస్థితిని ఎవరికి చెప్పుకోవాలో అర్థంగాక ఆటో డ్రైవర్లు రోజుకు కొన్ని గుంతల ప్రకారం పూడ్చుకుంటున్నారు. ఈ గుంతలతో ఆటోలు దెబ్బతినడమే కాకుండా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ



నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు శనివారం పంపిణీ చేశారు. మూగజీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పశువైద్యాధికారి నాగుల్‌మీరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందుతో ఏలిక పాములు, నులి పురుగులు నివారించవచ్చన్నారు. జూలై 10వ తేదీ వరకు అన్ని సచివాలయాల పరిధిలోని మూగ జీవాల ఉన్న చోటకు వెళ్లి ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని, ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది హిమబిందు, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుల నియామకం



నూతన అధ్యక్షులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

దర్శి (కురిచేడు): ఎమ్మార్పీఎస్ అధ్యక్షుల నియామకం శనివారం జరిగింది. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దర్శి నియోజకవర్గ అధ్యక్షుడిగా గూడూరి యోగేశ్వరరావు, కురిచేడు గ్రామ అధ్యక్షుడిగా కంభంపాటి ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బరిగల రూతుబాబును ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జి కంభంపాటి జోసఫ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంభంపాటి చిరు, కోట జాన్‌వెస్లీ, కోట వెంకీ, నందిగం తిమోతి, మాతంగి మరియదాస్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవీంద్రరెడ్డి

రాచర్ల: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కస్తూరి బా బాలికల పాఠశాలలో చదివే విద్యార్థులకు టీబీ సూపర్‌వైజర్ బీ.రవీంద్రరెడ్డి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైన రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, చాతినొప్పి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, తదితర లక్షణాలతో బాధపడుతుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎక్స్‌రే, కళ్లె పరీక్ష ద్వారా టీబీ వ్యాధి నిర్ధారణ అవుతుందని వివరించారు. టీబీ బాధితులకు ఆరు నుంచి తొమ్మిది నెలలపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో రంగనాయకులు, ప్రసాద్, కస్తూరి బా బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సందర్భంగా పీర్ల పెట్టెల ఊరేగింపు

మార్కాపురం టౌన్: మొహర్రం పండుగను పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని వివిధ పీర్ల చావిడిలలో ఉన్న పీర్ల పెట్టెలను శనివారం ఊరేగింపు నిర్వహించారు. నెలవంక కనిపించడంతో పట్టణంలోని పీర్ల చావిడీల్లో పీర్లకు ఊరేగింపు నిర్వహించారు. మత సామరస్యానికి చిహ్నంగా నిలిచే మొహర్రం పండుగ ప్రారంభమైంది. గొర్లగడ్డ పీర్లచావిడిలో ముజావర్లు జెండాను ఎగురవేశారు. డప్పులు, తప్పెట్ల నడుమ పీర్లపెట్టెలను పట్టణంలో ఊరేగించారు. భక్తులు పీర్ల పెట్టెలను దర్శించుకుని పప్పులు, బొరుగులను ఫాతేహాలుగా సమర్పించుకున్నారు.

స్వప్న వారాహిగా అమ్మవారి దర్శనం

మార్కాపురం: పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో వారాహి నవరాత్రుల సందర్భంగా మూడో రోజు శనివారం జగదాంబ అమ్మవారిని స్వప్న వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజ, అష్టోత్తర పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి పూజలు

అర్ధవీడు: మండలంలోని మాగుటూరు గ్రామంలో వెలసిన పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు పద్మావతి వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు శనివారం 101 ప్రదక్షిణలతో మొక్కులు తీర్చుకొన్న వారికి కోరిన కోర్కెలు తీరుతాయని ప్రగాఢ విశ్వాసం. మండలంలోని చుట్టు పక్క గ్రామాల ప్రజలు వందలాదిగా పాల్గొన్నారు.